


PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక: 41 ఎడిటర్: రాపోలు లింగస్వామి 11-10 -2026 ఆదివారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00

## ఎల్‌నినోపై సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష..



హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో తీవ్రమైన సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని ముందుగానే గుర్తించి, సమర్థంగా ఎదుర్కొనేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంపై అధికారులతో సీఎం రేవంత్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది జూన్ వరకు నీరు, వ్యవసాయం, విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేయకపోతే భవిష్యత్తులో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. కొవిడ్ సంక్షోభాన్ని ఎదుర్కొన్న తరహాలోనే ఎల్‌నినోతో తలెత్తే సమస్యలనూ అధిగమించేందుకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ప్రతి కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని రేవంత్ స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ సమస్యలు తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. అవసరమైతే విద్యుత్ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందన్నారు ముఖ్యమంత్రి. అయితే మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమైన అంశమని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందని చెప్పుకొచ్చారు. విద్యుత్‌పై ఆధారపడే పనులను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారు లకు సూచించారు. భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి సమస్యలు తీవ్రతరం కాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నీటి లభ్యత, వ్యవసాయ అవసరాలు, విద్యుత్ వినియోగం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

## పట్టభద్రుల మద్దతు కూడగట్టండి..




ఖమ్మం, అక్టోబర్ 10: జిల్లాలో ఖమ్మం?వరంగల్?నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని.. ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. త్వరలోనే మరిన్ని ఉద్యోగ నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్లు విడుదల కానున్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ వారికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో పట్టభద్రుల మద్దతు పొందేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రతి ఓటరుకు వివరించాలని పార్టీ నాయకులు.. కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమం విషయంలో రాజీపడటం లేదని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను రూ.9 వేల కోట్లతో చెల్లించామని వెల్లడించారు. ఉద్యోగ నియామకాలు.. ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను పట్టభద్రులకు వివరించాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్య, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఖాదర్ బాబా, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

**'సిరిసిరి మువ్వల సిరుల బతుకమ్మ' పాట సీడీని ఆవిష్కరించిన కల్వకుంట్ల కవిత**

**బతుకమ్మ పాట అద్భుతంగా ఉంది: కవిత**



హైదరాబాద్,జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 10:తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలంగాణ రక్షణ సమితి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రపంచంలో పూలను పూజించే సంప్రదాయం అరుదని, తెలంగాణలో మాత్రం పూలనే దేవతలుగా భావించి పూజించడం రాష్ట్ర సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో సంబురంగా జరుపుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని తెలిపారు.

**'సిరిసిరి మువ్వల సిరుల బతుకమ్మ' పాట ఆవిష్కరణ**

ఏవన్ టీవీ తెలుగు న్యూస్ సమర్పణలో రూపొందించిన 'సిరిసిరి మువ్వల సిరుల బతుకమ్మ' పాట సీడీని కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత, దర్శకుడు కోదారి శ్రీనివాస్ ఈ పాటను రచించగా, ప్రముఖ గాయని మమతా రమేష్ ఆలపించారు. నీరజ్ కీస్ సంగీతం అందించారు. డీఓపీగా బాలు, కొరియోగ్రాఫర్‌గా శాండి, డ్యాన్సర్‌గా సాజన్య తమ ప్రతిభను కనబరిచారు. జానపద కళాకారుడు గజ్జల శ్రీనివాస్ పర్యవేక్షణలో రూపొందిన ఈ పాట తనకు ఎంతో నచ్చిందని కవిత ప్రశంసించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా పాటను రూపొందించిన బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏ వన్ టీవీ తెలుగు న్యూస్ ఛైర్మన్ బీవీ బాలకృష్ణ, అవుట్‌పుట్ ఎడిటర్, సీనియర్ జర్నలిస్ట్ ఎంఎన్ తిరుమలరావు, టెక్నికల్ హెడ్ చైతన్య, రిపోర్టర్ దిండిగాల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.




## మాధవ్ నగర్ కాలనీలో ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు

**బతుకమ్మలతో సందడి చేసిన మహిళలు, చిన్నారులు**

చంపాపేట్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 10:ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా చంపాపేట డివిజన్ పరిధిలోని మాధవ్ నగర్ కాలనీలో మహిళలు, చిన్నారులు బతుకమ్మలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు, చిన్నారులు బతుకమ్మల చుట్టూ చేరి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు.



పాటలు పాడుతూ, ఉత్సాహంగా వేడుకలు జరుపుకోవడంతో మాధవ్ నగర్ కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## సుజాతనగర్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్

### – జీవో 187తో రూ.8.75 కోట్ల నిధులు



- నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఉచిత ఇంగ్లీష్ విద్య
- అత్యాధునిక ల్యాబ్‌లు, డిజిటల్ వసతుల కల్పన
- పట్టువదలకుండా ఎయిర్‌పోర్ట్ సాధిస్తాం
- నాలుగు లైన్ల రహదారిగా సుజాతనగర్ రోడ్డు
- మహిళల ఉపాధికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు
- త్వరలోనే పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం): సుజాతనగర్ మండల కేంద్రానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైందని, దీని ద్వారా పేద మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య చేరువవుతుందని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. సుజాతనగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఎన్నో ఏండ్లుగా ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్న విద్యా వసతుల కల్పన కోసం గత నెల రోజులుగా విద్యాశాఖ ఉన్నతాధికారులు, డైరెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరపడంతో జీవో నెంబర్ 187 ద్వారా పాఠశాల మంజూరైందని చెప్పారు. పాఠశాల అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 8.75 కోట్ల నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఉచితంగా ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన సాగుతుందని ప్రస్తుతం స్టేట్ సిలబస్‌తో మొదలై భవిష్యత్తులో సెంట్రల్ సిలబస్(సీబీఎస్ఈ) ప్రవేశపెట్టే యోచన ఉందని స్పష్టం చేశారు. పాఠశాలలో అత్యాధునిక సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ, అడ్మినిస్ట్రేషన్ గదులు, టాయిలెట్లు, 97 డ్యూయల్ డెస్క్ బెంచీలు, క్రీడా మైదానాలు నిర్మిస్తామన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం మధ్యాహ్న భోజనం సాయంత్రం స్నాక్స్ అందించేలా చర్యలు 3వ పేజీలో ..

## ప్రజాస్వామ్య గొంతుకపై ఉక్కుపాదం

**ఇది పాలనా? లేక అప్రకటిత ఎమర్జెన్సీనా?!**

**ఆనాడు కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీ.. నేడు బీజేపీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు!**



ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అక్టోబర్ 10:ఆనాడు కాంగ్రెస్ పార్టీ దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తే, నేడు బీజేపీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను సృష్టిస్తూ, ప్రతిపక్షాల గొంతును నొక్కుతూ, ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఓటర్ల పేర్లను అనైతికంగా తొలగిస్తోందనే ఆరోపణలు ప్రజాస్వామ్యంపై ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణ లక్ష్యంగా దేశవ్యాప్తంగా ఓటు చోరీ, ఓటర్ల జాబితాలో అక్రమాలపై వ్యక్తమవుతున్న ఆందోళనలకు మద్దతుగా ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ చౌరస్తాలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సర్ పేరుతో అర్హులైన ఓటర్ల తొలగింపుపై నిరసన ప్రత్యేకసమగ్ర ఓటర్ల జాబితా సవరణ సర్ ప్రక్రియ పేరుతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అర్హులైన ఓటర్ల పేర్లు పెద్దఎత్తున తొలగిస్తున్నారనే ఆరోపణలపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి, జవాబుదారీతనం పాటించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యానికి గుండెకాయ లాంటి భావవ్యక్తీకరణ స్వేచ్ఛను అణచివేస్తూ, ప్రశ్నించే గొంతులకు సంకెళ్లు వేస్తూ, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను నిర్బంధిస్తున్న చర్యలను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్రంగా 3వ పేజీలో ..

# సంపాదకీయం

## కొత్త జిల్లాల దశాబ్ది ఉత్సవాలు

సిద్దిపేట జిల్లా కల సాకారమై పదేండ్లు పూర్తయింది. ఈ సందర్భంగా 'సిద్దిపేట జిల్లా పదేండ్ల పండుగను సంబురంగా జరుపుకొంటున్నది. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు నేతృత్వంలో ఈనెల9,10,11 తేదీల్లో మూడు రోజుల పాటు దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిపేందుకు ఉత్సవ నిర్వహణ కమిటీ సమాయత్తం అవుతున్నది. తెలంగాణ సాధించిన మహానేత కేసీఆర్ సిద్దిపేట ఎమ్మెల్యేగా సిద్దిపేట జిల్లా కోసం పోరాటం చేశారు.సమైక్య పాలకులకు దండంపెట్టి దరఖాస్తులు ఇచ్చినా స్పందించని వారిని వెక్కిరిస్తూ తానే స్వయంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి.. ముఖ్యమంత్రి అయిన తర్వాత సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేశారు. జిల్లా ఏర్పడి పదేండ్లు పూర్తయిన సందర్భగా జిల్లా ఏర్పడక ముందు జ్ఞాపకాలు, కష్టాలను నెమరువేసుకుంటున్నది. కేసీఆర్, హరీశ్‌రావుల నేతృత్వంలో జిల్లాలో జరిగిన అభివృద్ధిని, భవిష్యత్తులో చేయాల్సిన కర్తవ్యాలను నిర్దేశించుకుంటున్నది. 1980 దశకంలో సిద్దిపేట జిల్లా కావాలనే డిమాండ్ మెల్లగా మొదలయ్యింది. ఈ సిద్దిపేటకు చెందిన కేసీఆర్ యువనాయకునిగా ఉన్న సమయంలోనే సిద్దిపేట జిల్లా కావాలనే డిమాండ్‌తో యువకులతో సమావేశాలు నిర్వహించారు.సిద్దిపేట జిల్లా సాధన సమితి, సిద్దిపేట జిల్లా పోరాట సమితి లాంటివి ఏర్పాటయ్యాయి. సిద్దిపేట జిల్లా ఏర్పాటు అంశం రాజకీయ ఎజెండా తెరమీదికి వచ్చింది. 1983లో మొట్టమొదటిసారిగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కేసీఆర్‌ఆ ఎన్నికల ఎజెండా మీదికి సిద్దిపేట జిల్లా, సిద్దిపేట ప్రాం తానికి రైలు, సిద్దిపేట ప్రాంతానికి సాగు, తాగునీరు అనేఅంశాలను ప్రధానంగా చర్చకు తెచ్చారు. 1983లో స్వల్ప తేడాతో కేసీఆర్ ఓడిపోయారు. 1985లో రాష్ట్ర ప్రభుత్వంలో సంక్షోభం రావడం.. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని ప్రధాని ఇందిరాగాంధీబర్తరఫ్ చేయడం వంటి రాజకీయ పరిణామాలు సంభవించాయి. అదే ఏడాది మధ్యంతర ఎన్నికలు జరిగాయి.ఆ ఎన్నికల్లో రెండోసారి సిద్దిపేట నుంచి పోటీ చేసిన కేసీఆర్ గెలుపొంది మొదటిసారిశాసనసభలో అడుగుపెట్టారు.ఆ ఎన్నికల్లో కూడా సిద్దిపేట జిల్లా ఏర్పాటు అంశం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. 1989 నాటికి సిద్దిపేట జిల్లా అంశం మరింత ఉధృతమైంది. ఆ ఎన్నికల్లో సిద్దిపేటకు ప్రచారానికి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు సిద్దిపేట జిల్లా అంశంపై కేసీఆర్ వినతిపత్రం ఇచ్చారు.అప్పటినుంచి సిద్దిపేట జిల్లా అంశానికి రాజకీయ ప్రాధాన్యత వచ్చింది.ఉద్యమ సమయంలోనూ అనేకసార్లు సిద్దిపేటలో జరిగిన సభల్లోనూ కేసీఆర్ సిద్దిపేట జిల్లా అంశాన్ని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన వెంటనే సిద్దిపేటజిల్లా చేసుకుందామని స్పష్టంగా చెప్పారు. 2014లో కేసీఆర్ ముఖ్యమంత్రిఅయ్యాక సిద్దిపేట జిల్లా ఏర్పాటుఅంశానికి మంచి రోజులు వచ్చాయి. 2016 అక్టోబర్ 11న దసరా పండుగ రోజున సిద్దిపేటజిల్లా ఆవిర్భావానికిముహూర్తం ఖరారు చేశారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలతోపాటు హుస్నాబాద్, జనగామ నియోజకవర్గంలో ఉండిసిద్దిపేటకు అతిచేరువలో ఉన్న కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు, ధూల్‌మిట్ట మండలాలు, మానకొండూరు నియోజకవర్గంలోని బెజ్జంకి మండలాన్ని సిద్దిపేట జిల్లాలో కలుపుతూ సిద్దిపేట జిల్లా భౌగోళిక స్వరూపాన్ని మార్చారు. సిద్దిపేట జిల్లాకోసం సుమారు రెండు,మూడు దశాబ్దాలుగా పోరాడిన కేసీఆర్ తాను సాధించిన తెలంగాణ తొలి రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో సగర్వంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతర కాలంలో సంగారెడ్డి నుంచి అన్ని ప్రభుత్వ శాఖలు సిద్దిపేట జిల్లాకు తరలివచ్చి, కార్యకలాపాలు ప్రారంభించాయి. కొత్త జిల్లా ఏర్పాటుతో సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, ప్రాంతాల ప్రజల 150 కిలోమీటర్లు వెళ్లే సంగారెడ్డి ప్రయాణానికి బ్రేక్ పడింది. ప్రభుత్వ అధికారులంతా ప్రజల ముందుకు వచ్చి సేవలు చేయడం మొదలుపెట్టారు. సిద్దిపేట జిల్లా అంతటా సంబురాలు అంబరాన్నంటాయి.హరీశ్‌రావు కోరిక మేరకు కేసీఆర్ సిద్దిపేటకు మెడికల్ కళాశాల మంజూరు చేశారు. పేద ప్రజలకు అన్ని రకాల నాణ్యమైన వైద్య సేవలు అందేవిధంగా అత్యాధునిక సౌకర్యాలతో 1,000పడకల ఆసుపత్రిని,దీనికి అనుబంధంగా మెడికల్ కళాశాలనిర్మించాలని యోచించడంతోఅది కూడా వేగంగా పూర్తయింది. ఏరియా ఆసుపత్రులు అప్‌గ్రేడ్ అయ్యాయి. సిద్దిపేట పట్టణంలో నలుదిక్కులా అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రారంభమయ్యాయి. మహిళల కోసం ప్రత్యేక హెల్త్ సెంటర్ ప్రారంభమైంది. పేదలకు వైద్యం మరింత చేరువైంది.ఒకవైపు సిద్దిపేట, మరోవైపు గజ్వేల్.ఇటు దుబ్బాక,హుస్నాబాద్,చేర్యాల ప్రాంతాలను ఏకకాలంలో అభివృద్ధి చేయడానికి కేసీఆర్ సంకల్పించారు. సిద్దిపేట జిల్లాను ఒక మాడల్ జిల్లాగా రూపొందించి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెట్టారు. విద్య, వైద్య, ఉపాధి, సాగు, తాగునీరు, విద్యుత్తు, రోడ్లు, భవనాలు, పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా సిద్దిపేట జిల్లాను తీర్చిదిద్దారు.సమైక్య రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోని సిద్దిపేట ప్రాంతాన్ని ఐదారేండ్లలోనే అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపారు.సాగునీటి సమస్యతో అల్లాడుతున్న రైతులకు గొప్ప ఊరటను.. బతుకుమీద ఆశను కల్పిస్తూ గోదావరి నదికి 570 మీటర్ల ఎత్తున ఉన్న సిద్దిపేట ప్రాంత కరువును శాశ్వతంగా దూరం చేసే మహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. కేసీఆర్ తన కలల ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల సరిహద్దులో అంతగిరి వద్ద అన్నపూర్ణ సాగర్, సిద్దిపేట నియోజకవర్గంలోని చిన్నకోడూరు మండలం చందులాపూర్ గ్రామం వద్ద రంగనాయకసాగర్, దుబ్బాక నియోజకవర్గంలోని తొగుట మండలం తుక్కాపూర్ గ్రామ శివారు.

# జ్ఞానేష్ కుమార్ ని తొలగించాలి

**- ఎస్ఐఆర్ ను రద్దు చేయాలి**

**- సామాన్యుని ఓటు హక్కును కాపాడాలి**

**- యు ఎస్ పి సి**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ డిమాండ్ భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం): జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని పలువురు డిమాండ్ చేశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ ఉపాధ్యాయుల సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ సమీపంలో గల అమరవీరుల స్తూపం దగ్గర శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ ప్రదర్శనలో ఉపాధ్యాయ సంఘాల స్టీరింగ్ కమిటీ నాయకులు బి.రాజు, జోగా రాంబాబు, మురళీమోహన్, ఎం.వెంకటేశ్వర్లు, హరిలాల్ పాల్గొని మాట్లాడుతూ సిఇసి ఏకపక్ష నిర్ణయాలను సమీక్షించాలని ఎన్నికల కమిషన్ స్వతంత్రను కాపాడాలని ఎస్ ఐ ఆర్ ప్రక్రియను రద్దు చేయాలనిఇప్పటి వరకు తొలగించిన 13 కోట్ల ఓట్లపైసమగ్ర స్వతంత్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం- 2023 ను రద్దు చేయాలని 2024 ఆ తర్వాత జరిగిన అన్ని ఎన్నికలపైవిచారణ చేపట్టాలని ఈవీఎంల బదులు బాలెట్ పేపర్లతో ఎన్నికలునిర్వహించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ ప్రదర్శనలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు వెంకటేశ్వర్లు, ఎం.రాజయ్య, జయరాజు, డి.దాసు, విజయ్ కుమార్, అక్బర్, హరి సింగ్, మంగీలాల్, అంబ్రిక జాదవ్, రాజారావు, ఏ.వెంకటేశ్వర్లు, బి.బాలు, సిహెచ్ బుచ్చి రాములు, పడిగ సత్యనారాయణ, భూక్య సుందర్, పూనెం సమ్మయ్య, బి.వెంకటేశ్వర్లు, కె.వసంతరావు, జీ.రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ఆఖరికి మిగిలేది



పుట్టినప్పుడు ఖాళీ చేతులతో ఈ లోకంలోకి వచ్చాం,పోయేటప్పుడు ఖాళీ చేతులతోనే తిరిగి వెళ్లిపోతాం,జీవితమంతా నాదంటూ కూడబెట్టిన ఆస్తులన్నీ ఇక్కడే వదిలేస్తాం,చివరి ప్రయాణంలో మన నీడ కూడా తోడు రాదని తెలుసుకుంటాం.నలుగురి కోసం బతికిన రోజులు జ్ఞాపకాలుగా మిగులుతాయి,మనసారా పంచిన ప్రేమే మన కథను చెబుతుంది,మనిషి పోయాక మిగిలేది అతడు కూడబెట్టిన సంపద కాదు,అతడు పంచిన ప్రేమ, చేసిన మంచే అతని చిరునామా అవుతుంది.చివరికి మన ఇల్లు పరుల సొంతమవుతుంది,మన పొలం మరొకరి చేతుల్లో పంట పండిస్తుంది, మనమంటూ తిరిగిన ఈ దేహం మట్టిలో కలిసిపోతుంది, మనదంటూ దాచుకున్న ఈ జీవితం ఓ జ్ఞాపకమై మిగులుతుంది. చివరి మజిలీలో ఆస్తులు అక్కరకు రావు,ఆప్యాయంగా పిలిచే గొంతులే మనసును తడిపేస్తాయి, నాలుగు భుజాల మీద సాగిపోయే ఆ ప్రయాణంలో,మన వెంట వచ్చేది మనం సంపాదించిన పుణ్యమే.అందుకే మనిషీ? ఈ మట్టిపై ఉన్నన్ని రోజులూ ప్రేమను పంచు,నీ వల్ల కన్నీరు కార్చేవారు కాదు, నీ కోసం కన్నీరు పెట్టుకునేవారిని సంపాదించు, ఎందుకంటే? నువ్వు కట్టిన మేడలు ఇక్కడే మిగిలిపోతాయి,నువ్వు కూడబెట్టిన ఆస్తులు పరుల సొంతమైపోతాయి?చివరికి నీది అనుకున్న ఈ నేల కూడా నీది కాదు,నిన్ను తనలో కలుపుకునే ఆ ఆరడుగుల నేల తప్పు!రచన : ఆర్.కె.రెడ్డిగోగులపల్లి, నెల్లూరు జిల్లా.

**సింగరేణి ఎన్నికలలోను**

**– కొత్తగూడెం మేయర్ ఎన్నికల్లోను – ఆర్టీసీ ఎన్నికల్లోను సిపిఐ....**

# ఏఐటీయూసీ తడాఖా చూపించాం

**సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధనుంజయ నాయుడు ఘాటు వ్యాఖ్య**

సూర్యాపేట, జ్యోతి ప్రభంజననం, ప్రతినిధి, అక్టోబర్ 10:ఆర్టీసీలో ఏఐటీయూసీ విజయం ఎర్రజెండాపై కార్మికుల నమ్మకానికి నిదర్శ నం ?తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసి) గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘంగా చారిత్రాత్మక విజయం సాధించడం పట్ల ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు మాట్లాడుతూ?"ఆర్టీసీ ఎన్నికల్లో లభించిన ఈ అపార విజయం కేవలం ఒక యూనియన్ విజయం కాదని, ఇది యావత్ ఆర్టీసీ కార్మికుల విజయం అని, ఎర్రజెండా, ఏఐటీయూసీ పోరాట పటిమపై కార్మికులకు ఉన్న అచంచలమైన విశ్వాసానికి ఈ తీర్పు ప్రత్యక్ష నిదర్శనం అని తెలిపారు. ఈ విజయం కోసం శ్రమించిన ఎంప్లాయిస్ యూనియన్ నాయకులకు, కార్యకర్తలకు, అలాగే కూటమిగా ఏర్పడి మద్దతు తెలిపిన ఎన్ఎంయూ,టిఎంయూ తదితర కార్మిక సంఘాల నాయకులకు హృదయపూర్వక అభినంద నలు.' అని తెలిపారు.ఇటీవల ముగిసిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలతో పాటు, ఇప్పుడు రాష్ట్రంలో అతిపెద్ద రవాణా సంస్థ అయిన ఆర్టీసీ ఎన్నికల్లోనూ ఏఐటీయూసీ అనుబంధ సంఘా లు విజయం సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల



న్యాయబద్ధమైన డిమాండ్ల సాధనకు, ప్రభుత్వంలో విలీన ప్రక్రియ పూర్తిస్థాయి అమలుకు, కార్మికుల సంక్షేమానికి సిపిఐ నిరంతరంఅండగాఉంటుందని, అసెంబ్లీ లోపల, వెలుపల కార్మికుల గొంతుకగానిలుస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమములో నేరేడుచర్ల మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి పాలక వీడు మండల సిపిఐ కార్యదర్శి ముల్లా జానయ్య మఠంపల్లి మండల సిపిఐ కార్యదర్శి అమరారపు పున్నయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చిలకరాజు శ్రీను సహాయ కార్యదర్శి కొమార్రాజు వెంకట్ ఏఐటీయూసీ ప్రాంతీయ సహాయ కార్యదర్శి ముత్యాల భాస్కర్ ఇన్సాఫ్‌మండల కన్వీనర్ ఎస్ కే సయ్యద్ పాషా ఉన్నారు

# సామూహిక అత్యాచారం కేసులో సంచలన తీర్పు..

మంచిర్యాల / పెద్దపల్లి: 9 అక్టోబర్ :మహిళపై సామూహిక అత్యాచారం కేసులో నిందితులకు కఠిన శిక్ష పడింది. ముగ్గురు పురుషులతో పాటు వారికి సహకరించిన మరో మహిళకు కూడా 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ కరీంనగర్ ూఅ, ూు ప్రత్యేక కోర్టు జడ్జి నీరజ శుక్రవారం తీర్పు ఇచ్చారు.ఒక్కొక్కరికి రూ.11 వేల జరిమానా కూడా విధించారు.ఘటన వివరాలు:2017 మార్చి 10న మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలానికి చెందిన బాధితురాలిని కూరగాయల అమ్మకం పేరుతో ఆటోలో తీసుకెళ్లారు. అనంతరం ముగ్గురు వ్యక్తులు ఆమెపై అత్యాచారానికి పాల్పడగా, మరో మహిళ వారికి సహకరించింది.బాధితురాలి ఫిర్యాదుతో సుల్తానాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది. బాధితురాలికి న్యాయం జరిగిందని, ఇలాంటి తీర్పులు మరొకరికి గుణపాఠంగా ఉంటాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

# తల్లిదండ్రుల త్యాగం

భగవద్గీత చదవకపోయినా పర్వాలేదు,
బైబిల్ బోధనలు తెలియకపోయినా పర్వాలేదు,



ఖురాన్ సందేశాలు వినకపోయినా పర్వాలేదు,
ఒక్కసారి నీ తల్లిదండ్రుల జీవితాన్ని చదువు...!
నీ ఆకలి తీర్చడం కోసం తమ ఆకలిని చంపుకున్న చరిత్ర అది,
నీ ఒంటిపై బట్ట కోసం తమ చిరిగిన బట్టలతో గడిపిన చరిత్ర అది,
నీ చేతిలో పుస్తకం పెట్టడం కోసం తమ ఆశలను తాకట్టు పెట్టిన చరిత్ర అది,
నీ కళ్లలో ఆనందం చూడటం కోసం తమ కన్నీళ్లను దాచుకున్న చరిత్ర అది!
నీకు జ్వరం వస్తే రాత్రంతా నిద్రపోని అమ్మ ప్రేమను చూడు,
నీ భవిష్యత్తు కోసం ఎండనక,
వాననక శ్రమించిన నాన్నను చూడు,
నీకు ఒక్క రూపాయి అవసరమైనా పది చోట్ల చేయి చాచిన చేతులను చూడు,
నీ జీవితం వెలిగించాలని తమ జీవితాలనే కొవ్వొత్తుల్లా కరిగించుకున్న వాళ్లను చూడు!
నీ ఓటమికి నీవు ఏడిస్తే నీకంటే ఎక్కువగా బాధపడేది వాళ్లే,
నీ చిన్న విజయానికే ప్రపంచాన్ని గెలిచినట్లు మురిసేది వాళ్లే,
నీ కోసం తమ యవ్వనాన్ని త్యాగం చేసి వృద్ధాప్యానికి చేరిన వాళ్లే,
నీవు ఉన్నతంగా ఎదగాలని తమ కలలన్నింటినీ పక్కన పెట్టిన వాళ్లే!
నీవు ఎదిగిన కొద్దీ వాళ్ల శరీరాలు వంగిపోతాయి,
నీకు రెక్కలు వచ్చిన కొద్దీ వాళ్ల అడుగులు నెమ్మదిస్తాయి,
నీవు ప్రపంచాన్ని గెలవడానికి పరుగులు తీస్తుంటే,
నీ ఒక్క పలకరింపు కోసం వాళ్ల కళ్లు గుమ్మం వైపు చూస్తుంటాయి!
వాళ్లు నీ నుంచి కోరుకునేది బంగారమో,
వెండో కాదు,వాళ్ల చివరి దశలో కోరుకునేది నీ ప్రేమతో కూడిన నాలుగు మాటలు,
వాళ్ల త్యాగాలను గుర్తించి కృతజ్ఞతతో తలవంచిన రోజే నిజమైన పండుగ,
వాళ్లు బతికుండగానే ప్రేమను పంచిన రోజే నీ జీవితానికి నిజమైన పుణ్యం!
గుర్తుంచుకో... తల్లిదండ్రులే మనం చదవాల్సిన తొలి చరిత్ర,
వాళ్ల త్యాగాలే మనం నేర్చుకోవాల్సిన గొప్ప గ్రంథం,
వాళ్ల కన్నీళ్లను తుడిచి, వాళ్ల ముఖంలో చిరునవ్వు నింపగలిగితే,
ఈ భూమిపై నీ జన్మకు అంతకంటే గొప్ప సార్థకత మరొకటి లేదు!
రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

# పాతబస్తీ మదన్నపేటలో బతుకమ్మ సంబరాలు

**రంగురంగుల పూలతో బతుకమ్మను అలంకరించిన చిన్నారులు**



హైదరాబాద్, జ్యోతి ప్రభం ం, అక్టోబర్ 10:తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు పాతబస్తీలోని మదన్నపేటలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గుండె పునర్విత, గుండె శ్రేయన్షిత రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొన్నారు.వివిధ రకాల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పేలా చిన్నారులు బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ వేడుకలతో పండుగ వాతావరణం నెలకొంది.

# ప్రాణం పోసే చెట్టు

ప్రాణం లేని రాతిలో దేవుణ్ణి వెతుకుతాడు,
ప్రాణం ఉన్న చెట్టులో దేవుణ్ణి చూడలేకపోతాడు!



గుడి గడపలో మోకరిల్లి మొక్కులు చెల్లిస్తాడు,
చెట్టు నీడలో మాత్రం గొడ్డలిని ఎత్తుతాడు!
దేవుడికి పూలతో పూజలు చేస్తాడు,
ఆ పూలనిచ్చే మొక్కలనే నిర్దాక్షిణ్యంగా నరికేస్తాడు!
దీపాలు వెలిగించి దైవాన్ని కొలుస్తాడు,
ఆ దీపానికి ప్రాణవాయువిచ్చే ప్రకృతిని కాలరాస్తాడు!
రాతి విగ్రహానికి పట్టు వస్త్రాలు కప్పుతాడు,
చెట్టు నీడన బతికే పేదవాడిని పట్టించుకోడు!
గుడి గోపురం ఎత్తు పెంచాలని తపిస్తాడు,
చెట్ల ఎత్తును పెరగనీయకుండా నరికేస్తాడు!
గంటలు మోగించి దేవుణ్ణి పిలుస్తాడు,
పక్షుల గూళ్లను కూల్చి వాటి మూగ రోదనను వినలేడు!
దేవుడి ముందు కొబ్బరికాయ కొడతాడు,
చెట్టును కొట్టి ప్రకృతి గుండెను చీల్చేస్తాడు!
గాలి కోసం దేవుణ్ణి వేడుకుంటాడు,
గాలినిచ్చే చెట్లనే నేలమట్టం చేస్తాడు!
వర్షాలు కురవాలని యజ్ఞాలు చేస్తాడు,
వర్షాలకు ఆధారమైన అడవులనే నాశనం చేస్తాడు!
మట్టితో చేసిన విగ్రహంలో మహిమను చూస్తాడు,
మట్టిలో వేర్లు పాతుకున్న చెట్టులో జీవాన్ని చూడలేడు!
దేవుడు సర్వాంతర్యామి అని ఉపన్యాసాలిస్తాడు,
ప్రకృతి ప్రతి అణువులోని దైవత్వాన్ని మరిచిపోతాడు!
ఓ మనిషీ! ఒక్కసారి నీ మనసును ప్రశ్నించుకో,
నీ భక్తిలో ప్రకృతికి చోటుందా అని ఆలోచించుకో!
దేవుణ్ణి పూజించే చేతులతో చెట్లను కాపాడు,
ప్రకృతిని ప్రేమించడమే నిజమైన భక్తి అని చాటి చెప్పు!

రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

# భగవంతుడిని పూజించే విధానం చాలా గొప్పది..

**కానీ చెత్త కుప్పల వరకు రానివ్వకండి**

**: మాడూరి గోపి గుప్తా సామాజికవేత్త**



రాజేంద్ర నగర్, జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి అక్టోబర్ 10 : భగవంతుడి ఫోటోలు, రూపాలు చాలామంది చెత్తకుప్పలలో పారేస్తున్నారని అన్నారు మాడూరి గోపి గుప్తా. పెళ్లి పత్రికలపై, విస్టింగ్ కార్డులు ఇతర ప్రింటింగ్ సంబంధించి వాటిలో దేవుడి చిత్రాలు ముద్రించకుండా కేవలం పేర్లను మాత్రమే వాడితే బాగుంటుందని చెప్పారు గోపి గుప్తా. అక్టోబర్ 10న మాట్లాడుతూ చాలామంది హిందువులు పెళ్లి పత్రికలను కొట్టిస్తారని వాటి పై భగవంతుడి చిత్రాలు ముద్రించి బంధువులకి, మిత్రులకి పంచుతారని వాటిని అందరూ సక్రమంగా ఉపయోగించకుండా కార్యక్రమాలు అయిపోయిన తర్వాత చెత్తలో పడేస్తున్నారని, అలా చేయడంవల్ల మన పూజించే దేవుళ్ళని మనమే చెత్త కుప్పలో వేయడం సరైనది కాదని అన్నారు. వీలైనంతవరకు కేవలం పేర్లనే ప్రింటింగ్ చేస్తే సరిపోతుందని, దేవుడు ఫోటోలు ప్రింటింగ్ చేయకుండా అందరూ ఒక ఆలోచన చేయాలని తెలిపారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**- కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ**

**- గరీబ్‌పేటలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్**



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చదువు పైనే దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ సూచించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు సుజాతనగర్ మండల పరిధిలోని గరిబ్‌పేట గ్రామంలో శనివారం తెల్లవారుజామున కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 68 ద్విచక్ర వాహనాలు, 19 త్రిచక్ర వాహనాలను గుర్తించి మొత్తం 87 వాహనాలపై చట్టప్రకారం జరిమానాలు విధించారు. అదేవిధంగా 30 ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామస్థులతో మాట్లాడుతూ గంజాయి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు తగిన పర్యవేక్షణ వహించాలని కోరారు. కోడిపందాలు పేకాట జూదం మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ఓటీపీ యూపీఐ మోసాలు నకిలీ ఫోన్ కాల్స్ అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఇటీవల నమోదైన కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి పునరావృతంగా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు సహకరించాలని, గ్రామంలో మతసామరస్యాన్ని కాపాడాలని డీఎస్పీ సూచించారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లో సిఐలు యాసీన్, వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, శ్రీలక్ష్మి, పోలీస్ అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫలక్ నుమా ఖాళీ మాతా మందిరం వద్ద భక్తులకు సరైన వసతులు కల్పించాలి

**వేలాది మంది భక్తులు వచ్చే చోట కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయటం ప్రభుత్వం బాధ్యత**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

**ఫలక్ నుమా ఖాళీ మాతా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసిన టీఆర్ఎస్ చీఫ్**



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 10:పాతబస్తీలోని ఫలక్ నుమా ఖాళీ మాతా ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు లేక



ఇబ్బంది పడుతున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం వేలాదిగా భక్తులు వచ్చే ఆలయంలో కనీస సౌకర్యాలు కల్పించకపోవటం విచారకరమన్నారు. శుక్రవారం ఫలక్ నుమా ఖాళీ మాతా మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పాతబస్తీలోని ఖాళీ మాతా ఆలయమంటే హైదరాబాద్ ప్రజలకు ఎంతో నమ్మకమని, భక్తులకు కొంగు బంగారమని చెప్పారు. అలాంటి ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు లేవని చెప్పారు. ఆలయం వద్ద సరైన రోడ్డు మార్గం లేదని, మహిళలకు వాష్ రూమ్ లు కూడా లేని పరిస్థితి ఉందన్నారు. చుట్టు రైల్వే ల్యాండ్స్, పక్కనే స్మశానం ఉండటంతో రోడ్డు వేసే పరిస్థితి కూడా లేదన్నారు. ఎండోమెంట్ డిపార్ట్ మెంట్, అదే విధంగా రైల్వే అధికారులతో మాట్లాడి ఇక్కడ రోడ్లు వేసేలా, ఆలయంలో వసతులు కల్పించే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే



కూడా ఈ విషయంలో చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

**బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు**

అటు.. నేటి నుంచి బతుకమ్మ పండుగ ప్రారంభం కానున్న సందర్భంగా తెలంగాణ ప్రజందరికీ కవిత బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ లో ట్వీట్ చేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను తెలంగాణ ఆడబిడ్డందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అన్నారు. నాడు తెలంగాణ రాష్ట్ర సాధనకు బతుకమ్మను సాంస్కృతిక వారధిగా మలుచుకున్న మనమంతా..ఇప్పుడు సకల జనుల వికాసం, బహుజన తెలంగాణ సాధన కోసం బతుకమ్మలో గౌరమ్మలా ఒదిగి కలిసి పనిచేద్దామన్నారు.

# మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి ని డాక్టర్ దద్దాల పరామర్శ



కనిగిరి, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 10:అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల శస్త్రచికిత్స చేపించుకొని కనిగిరిలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్ రెడ్డి ని పార్టీ శ్రేణులతో కలిసి శనివారం కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా చికిత్సకు సంబందించిన వివరాలు ఆరా తీసి, ప్రస్తుతం ఆమె ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ గారు ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గఫార్,చింతగుంట్ల సాల్మన్ రాజు, సూరసాని మోహన్ రెడ్డి, కటికల వెంకటరత్నం, రాచపూడి మాణిక్యరావు,తమ్మినేని సుజాత,డాక్టర్ షేక్ నాయబ్ రసూల్,చింతం శ్రీనివాసులు ,పులి శ్రీను, చీమలదిన్నె వెంగయ్య, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, అయిమళ్ళ నాగమణి, యర్రబల్లి దేవరాజ్, షేక్ ఖాజా మొహిద్దిన్, దర్శి ఫణి కుమార్, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి,షేక్ పోలిచర్ల రహీం భాష,దేవకి రాజీవ్ , చింతలపూడి చెంచులు ,పల్నాటి భాస్కర్ రెడ్డి, షేక్ నాగూర్ వలి, చింతగుంట్ల కిషోర్ బాబు,పలుకూరి భాస్కర్, షేక్ కరిముల్లా, వంకదారి రాజా, షేక్ రెహమాన్, సైతం ఏడుకొండలు రెడ్డి ,బెల్లంకొండ రంగనాయ కులు, ఆవుల తిరుపతిరెడ్డి, షేక్ షకీలా, ఇండ్ల భాను, మద్దిశెట్టి భారతి, చెరుకూరి రంగయ్య, కాకు సుధాకర్, షేక్ సందాని, లైలా కిషోర్, మల్లెల వెలుగొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి ..

## సుజాతనగర్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్

ఉంటాయన్నారు. రాబోయే నాలుగు ఐదు రోజుల్లోనే ప్రజాప్రతినిధుల సమక్షంలో పాఠశాల పనులకు శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు గతంలోనే సూత్రప్రాయ ఆమోదం లభించినా సాంకేతిక కారణాలు భూసేకరణ ఆలస్యం వల్ల కొంత వెనుకబడిందని పట్టువదలకుండా ప్రయత్నించి జిల్లాకు ఎయిర్‌పోర్ట్, పరిశ్రమలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నాయకులగూడెం నుంచి సుజాతనగర్ వరకు సెంట్రల్ లైటింగ్‌తో కూడిన నాలుగు లైన్ల రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. సుజాతనగర్ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంతో పాటు పాత పంచాయతీ ఆఫీస్ స్థలంలో మోడల్ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని తెలిపారు. మహిళలకు స్థానికంగా ఉపాధి కల్పించేందుకు రవి, పాపారావులతో కలిసి 300 మందికి గృహ పరిశ్రమల ద్వారా పని కల్పిస్తున్నామని వివరించారు. ఈ ప్రాంతంలో కూరగాయలు, మిర్చి సాగు అధికంగా ఉన్నందున కోల్డ్ స్టోరేజీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారన్నారు. సుజాతనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం కావడం, నాన్-షెడ్యూల్డ్ భూములు అందుబాటులో ఉండటంతో పారిశ్రామిక అభివృద్ధికివిస్తృతఅవకాశాలు ఉన్నాయన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ప్రజలు ఐక్యంగా సహకరించాలని కూనంనేని కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డీఈవో వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ లాల్ సింగ్, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, నాయకులు వాసిరెడ్డి మురళి భూక్య దస్రు, సిపిఐ మిత్రపక్షల నాయకులు కోమారి హన్మంతరావు, జక్కుల రాములు, రామ్మూర్తి, రాజగోపాల్, వెంకటేశ్వరరావు, ధర్మారావు, అజయ్, రాజశేఖర్, జగన్, కామేష్, ఉపేందర్, శ్రావణి, అనిత, రవి, పండు, తిరుపతిరెడ్డి, బందగి, రాంప్రసాద్, భద్రరావు, భూక్య శ్రీను, వెంకట్, అనిల్, మౌలానా, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి ..

## ప్రజాస్వామ్య గొంతుకపై ఉక్కుపాదం

ఖండిస్తోంది.గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఓటింగ్ ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఏ ఐ సాంకేతికతను ఉపయోగించి ప్రతిపక్షాల ఓట్లను లక్ష్యంగా చేసుకుని, రాఎఖీ ప్రక్రియ ద్వారా మోదీ ప్రభుత్వం అక్రమంగా ఓటర్ల పేర్లను తొలగిస్తోందనే ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.నిరసన హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధందేశ రాజధానిలో నిర్బంధ వాతావరణం నెలకొన్నట్లుగా సాగుతున్న చర్యలు ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. 57 మెట్రో స్టేషన్లను మూసివేయడం, సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకున్న తర్వాత కూడా 40 స్టేషన్లలో రాకపోకలకు అంతరాయం కలగడం, నార్తర్న్ రైల్వే పరిధిలో 38 రైళ్లను రద్దు చేయడం వంటి పరిణామాలతో సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారనే అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి.దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులను, ప్రయాణికులను ఇటార్సీ?భోపాల్ స్టేషన్ల వద్ద అడ్డుకోవడం, తెలంగాణ నుంచి తమ హక్కుల కోసం తరలివెళ్లిన విద్యార్థులను భోపాల్‌లో నిర్బంధించడం వంటి చర్యలు శాంతియుత నిరసన తెలిపే హక్కుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.ఈ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని అన్నారు.అరెస్టు చేసిన విద్యార్థులను వారి వారి రాష్ట్రాలకు క్షేమంగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.బిజెపి ఫేక్ మీడియా ద్వారా దేశద్రోహులని,పాకిస్తాన్ గూడచారులని,చైనా గూడచారులని,జార్జ్ సోరస్ మనిషి అనే ముద్రలు వేసే ప్రయత్నం మీ ఫేక్ మీడియా ద్వారా చేయకండి.మీరు గత 12 సంవత్సరాలుగా చేస్తున్న ప్రయత్నాలు ఇవన్నీ.ఒక శాంతియుత ప్రజాస్వామ్య నిరసనను అడ్డుకోవడానికి వేలాది మంది పోలీసులను మోహరించాల్సిన అవసరం ఏమిటి? ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పాలకులు, ప్రజల గొంతులను అణచివేయడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారు? ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కును గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై లేదా?ఎమర్జెన్సీ చరిత్రను గుర్తుచేస్తున్న ప్రస్తుత పరిణామాలు1975లో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ దేశ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచిపోయింది. నేడు ప్రజల హక్కులను అడ్డుకునే చర్యలు కొనసాగితే, అవి మరోసారి అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులను తలపిస్తాయి. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే నిరంకుశ పోకడలనైనా బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుంది.ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలిప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇవ్వాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఈ ధర్నా ద్వారా బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.పాలకులు గుర్తుంచుకోవాలి నిర్బంధాలతో ప్రజాగ్రహాన్ని ఆపలేరు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, శాంతియుత నిరసన, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదులు. ప్రజల హక్కులను కాపాడటం, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం కోసం బీఆర్ఎస్ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుంది.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,ఉద్యమకారులు,మహిళలు,కార్యకర్తలు పాల్గొని ఓటు హక్కు పరిరక్షణకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

## ఎం సి పి ఐ యు రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయండి.

**వరి కుప్పల వెంకన్న .రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు.**



భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ .ఐక్య .ఎం సి పి ఐ యు తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు అక్టోబర్ 11.12 తేదీలలో హైదరాబాదులో పార్టీ కార్యాలయం. ఓంకార్ భవన్. బి.యన్ రెడ్డి రెడ్డి హాల్లో. జరుగుతున్నాయని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న తెలిపారు.ఈరోజు పత్రిక విలేకరుల సమావేశంలో వెంకన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రభుత్వంపై ప్రజా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడానికి భవిష్యత్తు కార్యాచరణ సమావేశాలలో నిర్ణయం చేయడం జరుగుతుందని వెంకన్న అన్నారు.ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ .మద్ది కాయల అశోక్ ఓంకార్. తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్.గాదగోని రవి హాజరైతున్నారని.పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా కార్యదర్శులు హాజరవుతున్నారని వెంకన్న తెలిపారు.

## పూల పండుగ- బతుకమ్మ!

పండుగొచ్చిందంటే చాలు.. వాకిళ్లన్నీ అలికి ముగ్గులేస్తాయి. చెట్లన్నీ రంగురంగుల పూలతో సింగారించుకుంటాయి. చెరువులన్నీ నిండుగా నీళ్లతో ఆడబిడ్డలకు స్వాగతం పలుకుతాయి. ప్రకృతి సైతం పండుగ శోభను సంతరించుకుంటుంది. పూలతో దేవతలను పూజించడం సాధారణం. కానీ పూలనే అమ్మవారిగా, గౌరీదేవి స్వరూపంగా కొలిచే గొప్ప సంస్కృతి మన బతుకమ్మ. ప్రకృతిని ఆరాధిస్తూ, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను చాటిచెప్పే అపురూపమైన పండుగ ఇది.బతుకమ్మ వచ్చిందంటే అత్తవారింటి నుంచి ఆడపడుచులు పుట్టింటికి చేరుకుంటారు.అమ్మ ఆప్యాయతను,అన్నదమ్ముల అనురా



గాన్ని మనసారా ఆస్వాదిస్తారు. కలిసి చదువుకున్న దోస్తులంతా కలుసుకుని,బొడ్డెమ్మలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటారు. చిన్ననాటి అల్లర్లు, ఆటపాటలు,మధురమైన జ్ఞాపకాలు మళ్లీ కళ్లముందు కదలాడుతాయి.బతుకమ్మ చుట్టూ చేరి రంగురంగుల పూలతో గౌరమ్మను పూజిస్తూ,పాటలు పాడుతూ,చప్పట్లు కొడుతూ ఆడే ఆడబిడ్డలను చూస్తే మనసు ఆనందంతో నిండిపోతుంది. ఆ వేడుకలో కనిపించేది పూల అందమే కాదు.పుట్టింటి ప్రేమ,స్నేహంలోని మాధుర్యం, కుటుంబ బంధాల్లోని ఆత్మీయత! బతుకమ్మ అంటే ఒక్క పూల పండుగ మాత్రమే కాదు. ప్రకృతితో బంధం.పుట్టింటితో పేగుబంధం.. అన్నదమ్ములతో రక్తసంబంధం.. దోస్తులతో స్నేహబంధం.. ఎన్నో అనుబంధాల కలయిక!కాలం మారినా, మనుషులు ఎక్కడెక్కడో ఉన్నా.బతుకమ్మ పండుగ మన మూలాలను గుర్తుచేస్తుంది.మన సంస్కృతిని కాపాడుకోవాలని, బంధాలను పదిలపరుచుకోవాలని, ప్రేమానురాగాలను పంచుకోవాలని చాటిచెబుతుంది.పూలను పేర్చి బతుకమ్మను తయారుచేస్తాం.. కానీ ఆ పూల మధ్య మన బాల్యాన్ని, మన బంధాలను,మన సంస్కృతిని పదిలపరుచుకుంటాం.!ఈ బతుకమ్మ పండుగ సందర్భంగా గౌరీమాత ఆశీస్సులతో ప్రతి ఇంటా సిరి సంపదలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఆడబిడ్డ జీవితం ఆనందమయం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ. తెలంగాణ ఆడపడుచులందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు!

# పేదల ఒక పూట ఆకలి తీర్చడం అభినందనీయం

సూర్యాపేట జిల్లా కేంద్రంలోమహాలయ అమావాస్య సందర్భంగా పితృ దేవతల ఆశీర్వాదం కోసం దాతలు ముందుకొచ్చి నిరుపేదల ఒక పూట ఆకలి తీర్చడం అభినందనీయమనితెలంగాణ టూరీజం అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పటేల్ రమేశ్రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ నివేదితలక్ష్మాది లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శంకర్ విలాస్ సెంటర్లో ట్రెండ్స్ ఎదురుగా మహాలయ అమావాస్య సందర్భంగా ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. గత ఐదేళ్ళుగా నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరు సేవాగుణం అలవర్చుకోవాలని అందులో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు సుమన్ వెంకన్న, గోపారపు రాజులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం మహా అన్నదాన కార్యక్రమనికి సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వెలుగు వెంకన్న, బండారు రాజా, చల్లా లక్ష్మీకాంత్,



బొల్లం సురేష్, మొరిశెట్టి రాము, కొండా శ్రీనివాసరావు, బ్లూసీ జాని, సైదులు, సిద్ది శ్రీకాంత్, గుడిపాటి రమేష్, చందా రాజశేఖర్, నరేంద్రుణి హరీష్ తదితరులు ఉన్నారు.

## 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026కు జోనల్ స్థాయి క్రీడా ఎంపికలను ప్రారంభం

నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్?2026లో పాల్గొనే క్రీడాకారుల ఎంపికలో భాగంగా యాదాద్రి-వి జోన్ స్థాయి క్రీడా ఎంపికలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ప్రారంభించారు. పోలీస్ సిబ్బందిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ఎంపిక చేయడమే ఈ జోనల్ స్థాయి ఎంపికల ప్రధాన ఉద్దేశమని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు.తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్?2026లో భాగంగా క్లస్టర్-డి పోటీలు నవంబర్ 3 నుంచి





5వ తేదీ వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో, క్లస్టర్-ఈ పోటీలు నవంబర్ 25 నుంచి 28వ తేదీ వరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా వివిధ క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు పోటీలు నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన యాదాద్రి-వి జోనల్ స్థాయి ఎంపికల్లో పాల్గొన్న పోలీస్ క్రీడాకారుల ప్రతిభ, క్రీడా నైపుణ్యం, శారీరక సామర్థ్యం, ప్రదర్శన ఆధారంగా ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసే ప్రక్రియ చేపట్టారు. ఎంపికైన క్రీడాకారులు రానున్న రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.పోలీస్ విధులను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా సిబ్బందిలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సమయపాలన, జట్టుగా పనిచేసే సామర్థ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని ఎస్పీ పేర్కొన్నారు. క్రీడలు పోలీస్ సిబ్బందిలో మానసిక ఉల్లాసాన్ని పెంచడంతో పాటు విధి నిర్వహణలో మరింత చురుకుదనాన్ని అందిస్తాయని తెలిపారు. సిబ్బందిలోని క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తూ, రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా పోలీస్ శాఖ అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు సంతోష్, హరిబాబు, శ్రీను, పోలీస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## స్థానిక మేజర్ గ్రామపంచాయతీ కార్మికులకు దుప్పట్లు, భోజనం పంపిణీ

**పి ఎ సి ఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ చేతుల మీదుగా అందజేత**

గార్ల సేవా భావాన్ని దృష్టిలో ఉంచుకొని మండల శ్రీరామదండు 108 కమిటీ ఆధ్వర్యంలో, స్థానిక మేజర్ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల సేవలను అభినం దిస్తూ దుప్పట్లు, భోజనం సరఫరా చేశారు.శ్రీ రామ దండు 108 కమిటీ ప్రతి అమావాస్యకు పట్టణ కేంద్రంలోని రామాలయాల ఎదుట భోజనం ప్యాకెట్స్ ను పంపిణీ చేస్తారు, అందులో భాగంగానే, శనివారం గ్రామపంచాయతీ ప్రాంగణంలో పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, స్థానిక మేజర్



గ్రామపంచాయతీ సర్పంచ్ భానోత్ పార్వతి హాజీరామ్ నాయక్ సంజీవరెడ్డి, గౌరవ్ అగర్వాల్, కమిటీ బాధ్యులు కట్ట రమేష్, కమల్ అగర్వాల్ , కూసుకుంట్ల ఉపేందర్ రెడ్డి తదితరులతోపాటు ఆయన చేతుల మీదుగా దుప్పట్లు, భోజనం ప్యాకెట్స్ ను, 2 రెగ్యులర్,3 బిల్ కలెక్టర్స్ 24 మంది మల్టీపర్పస్ వర్కర్స్ పారిశుద్ధ్య కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఏసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ ప్రసంగిస్తూ జి,పి కార్మికులు తమ సేవలను అందించి ప్రజల మన్నలను పొందాలని హితవు పలికారు. ప్రజాహితమే జీవితానికి పరమార్థం అన్నారు. ఈ కార్యక్రమంలో జిపి కార్మికులు శైజాద్ ఎండి హమీద్, వి నరేష్ కె రాజశేఖర్ రాజేష్ ఎం శ్రీనివాస్ పి ప్రభాకర్ ఎండి సైదా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలి..

**ఏ ఈ కి వినతి పత్రం అందించిన ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో**

తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని నాగారం మండలంలో



ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలని రైతాంగానికి రోజుకు కనీసం 12 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ నాగారం మండల కేంద్రంలోని ఢీకొత్తపల్లి గ్రామం నుండి ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి నాగారం మండలం ట్రాన్స్కో ఏ ఈ కార్యాలయం ముందు నాగారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు అదేవిధంగా పలువురు ఏఐకేఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు 12 రోజుల సెలవులు

లబ్ధిదారులకు ముందస్తుగానే టేక్ హోమ్ రేషన్ పంపిణీకి అనుమతి మంత్రి సీతక్క ఆదేశాల మేరకు బతుకమ్మ, దసరా పండుగ



OFFICE OF THE DIRECTOR, WOMEN DEVELOPMENT AND CHILD WELFARE DEPARTMENT, TELANGANA STATE HYDERABAD.

Memo.No.5076/ICDS-1/2018, Dt: 09.10.2026.

Sub: WD&CW Dept. - ICDS - Dussehra holidays to all AWCs from 10.10.2026 to 21.10.2026 - Issue THR instead of hot cooked meal - Certain instructions issued - Reg.

Ref: 1. Representation received from Anganwadi Teachers & Helpers.
2. Note approval of the Director, WD&CW Dept, Hyderabad, dt:09.10.2026.

*****

Attention is invited to the subject and reference cited.

Vide reference cited, representation received from the Anganwadi Teachers & Helpers requesting to declare the holidays to all AWCs in the State on the occasion of Dussehra from 10.10.2026 to 21.10.2026 (12 days).

In view of the above, permission is hereby accorded for sanction of Dussehra Holidays to all the Anganwadi Teachers & Helpers from 10.10.2026 to 21.10.2026 (12 days) permitted for issue THR instead of Hot cooked meal to the beneficiaries for above said days, AWCs will be reopen functioning normally from 22.10.2026.

Hence, the DWOs and CDPOs are directed to issue instructions to the Supervisors, AWTs and AWHs working under your jurisdiction.

Joint Director (ICDS)

To
All the CDPOs in the State.
All the DWOs, WCD&SC Dept. with similar instructions.
Copy to RJDs, Hyderabad & Warangal to pursue the matter.
Copy to SNP, Poshan Abhiyaan & IT Sections of this office.
Copy submitted to the Secretary to Govt., Dept. for WCD&SC for information
Soft copy kept in mail.

సందర్భంగా రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు అక్టోబర్ 10 నుంచి 21వ తేదీ వరకు 12 రోజుల పాటు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. సెలవుల కాలంలో లబ్ధిదారులకు సాధారణంగా అందించే వేడి భోజనం (హాట్ కుక్డ్ మీల్)కు బదులుగా టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేయడానికి అనుమతి ఇచ్చారు.అక్టోబర్ 22వ తేదీ నుంచి రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయి. ఈ మేరకు తమ పరిధిలోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు,హెల్పర్లకు అవసరమైన సూచనలు జారీ చేయాలని జిల్లా సంక్షేమ అధికారులు, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారులను శాఖ ఆదేశించింది.ప్రభుత్వ స్కూల్ టీచర్ల మాదిరిగానే తమకు బతుకమ్మ,దసరా సెలవులు మంజూరు చేసినందుకు అంగన్వాడీ టీచర్లు,హెల్పర్లు మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. అంగన్వాడీ చరిత్రలోనే మొదటిసారిగా దసరా సెలవులు ఇచ్చి అంగన్వాడీ టీచర్స్ ని హెల్పర్స్ ని బతుకమ్మ సంబరాలు సంబరంగా చేసుకోమని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఇంద్ర ప్రియదర్శిని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఐ ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షురాలు డి అన్నపూర్ణ.

printed and published by Rapolu Lingaswamy,onbehalf of printed at SMILYS ONLINE 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana Editor: Rapolu Lingaswamy.pone:9908103501, PRGI NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com